# సాక్షి
## శ్రీకాకుళం

శుక్రవారం । 19 । జూలై । 2024






### ప్రయోగం ఫలించింది

అంబేడ్కర్ వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థులు అద్భుత ప్రయోగం చేపట్టారు. రాకెట్ రీ ల్యాండింగ్‌పై పరిశోధనలతో ఆకట్టుకున్నారు. - 8లో



### మహాత్ముడే మా దేవర

కేదారిపురం గ్రామస్తులు దశాబ్దాల ఆనవాయితీ ఈ ఏడాది కూడా పాటించారు. మహాత్మా గాంధీకి ప్రత్యేక పూజలు చేశారు. - 8లో

### 24 నుంచి బీపీఈడీ, డీపీఈడీ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీపీఈడీ, ఈపీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయని డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం చెప్పారు. ఈ నెల 27 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

## న్యూస్‌రీల్

### జిల్లాలో జోరుగా వానలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వాతావరణంలో మార్పులు కారణంగా జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు ఇదే వాతావరణం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇంతకాలం వానలు పడక నారు ఎండిపోతున్న దశలో వరుణుడు కరుణించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 481 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆమదాలవలసలో అత్యధికంగా 52.8 మి.మీ, మెళియాపుట్టిలో 44.4 మి.మీ, కంచిలిలో 38.6 మి.మీ, పలాసలో 38.4 మి.మీ, సారవకోటలో 32.8, మి.మీ, సరుబుజ్జిలిలో 32.6 మి.మీ, గారలో 27.6 మి.మీ, జలుమూరులో 22.4 మి.మీ చొప్పున వర్షం పడింది.

### కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ **08942-240557**, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నంబర్లు **7794082017** సిద్ధం చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించారు. మండల, డివిజన్ స్థాయిలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

### హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. హెల్మెట్ వినియోగంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత కోర్టు నుంచి డే అండ్ నైట్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఎ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### వేట నిషేధ పరిహార భృతికి 12,952 మంది ఎంపిక

అరసవల్లి : వేట నిషేధ కాలంలో పరిహార భృతి అందించే ప్రక్రియలో అర్హులను సర్వే ద్వారా గుర్తించి, ఆ జాబితాను నవశకం పోర్టల్‌లో పొందుపర్చామని జిల్లా మత్స్యశాఖాధికారి పి.వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. 'సాయం కోసం ఎదురుచూపు' పేరిట 'సాక్షి'లో గురువారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. జిల్లాలో గత ఏడాది మేలో అప్పటి ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలో 15282 మందికి రూ.15.2 కోట్లను జమ చేశామని.. తాజాగా వేట నిషేధ కాలానికి 15375 మందిని అర్హులను గుర్తించామని, వీరిలో ఆరు దశల వడపోతలో 12952 మందిని మాత్రమే అర్హులుగా, 2423 మంది అనర్హులుగా గుర్తించామని వివరించారు. రీవెరిఫికేషన్‌లో ఇంకా అర్హులుంటే వారిని కూడా గుర్తించేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని పేర్కొన్నారు. అయితే రీవెరిఫికేషన్ విధి విధానాలపై ఇంకా మార్గదర్శకాలు వెలువడలేదని ఆయన స్పష్టం చేశారు.

### డిగ్రీ ఇన్‌స్టెంట్ ఫలితాలు విడుదల



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ చివరి ఏడాది ఐదో సెమిస్టర్ విద్యార్థులకు నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టెంట్ ఫలితాలను వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం విడుదల చేశారు. ఈ నెల 9న పరీక్ష నిర్వహించగా.. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు ప్రొవిజనల్‌లు, మార్కులు జాబితాలను సైతం సిద్ధం చేశారు. 241 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 231 మంది ఉత్తీర్ణత సాధించారు. 95.85 శాతం ఫలితాలు నమోదయ్యాయి. బీఏలో 11 మందికి 11 మంది, బీసీఏలో 8 మందికి 8 మంది, బీకాంలో 22 మందికి 16 మంది, బీఎస్సీలో 200 మందికి 196 మంది ఉత్తీర్ణత సాధించారు.



డొక్కరి రాజేష్ (ఫైల్)

- వీర జవాను రాజేష్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- ఎడతెరిపినివ్వని వర్షంలోనూ వేలాదిగా హాజరైన పరిసర గ్రామాల ప్రజలు
- కొత్తపేట నుంచి చెట్లతాండ్ర వరకు భారీ ర్యాలీ
- భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ

విశాఖపట్నంలో..



# వీరుడా విశ్రమించు...

దేశరక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుకు అశ్రునయనాలతో జనం కన్నీటి వీడ్కోలు పలికారు. ఓ వైపు జోరుగా వర్షం కురుస్తున్నా.. వీరుడికి వీడ్కోలు పలికేందుకు స్వగ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది పౌరులు హాజరై జోహార్లు పలికారు. వీరుడా నీకు వందనం.. భారత మాతకు జై అంటూ నినాదాలు చేశారు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామంలో ఆర్మీ నాయక్ డొక్కరి రాజేష్ (25) అంత్యక్రియలు అధికార లాంఛనాలతో గురువారం నిర్వహించారు. జమ్మూ సరిహద్దు ప్రాంతంలో సోమవారం జరిగిన ఉగ్రవాదుల దాడిలో రాజేష్ వీర మరణం పొందిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి రాజేష్ మృతదేహాన్ని న్యూఢిల్లీకి తరలించి విశాఖపట్నం వరకు విమానంలో తీసుకొచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకువస్తుండగా కోటబొమ్మాళి మండలం కొత్తపేట జంక్షన్ వద్దకు యువకులు, చుట్టుపక్కల గ్రామస్తులు భారీ సంఖ్యలో చేరుకొని స్వగ్రామం చెట్లతాండ్ర వరకు ర్యాలీగా తీసుకెళ్లారు.

**హాజరైన ప్రజాప్రతినిధులు..**

ప్రజల సందర్శనార్థం కొద్ది సమయం ఇంటి ఆవరణలో మృతదేహాన్ని ఉంచారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు చిట్టివాడు, పార్వతి, సోదరుడు మధుసూదనరావు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆర్మీ, ఎన్‌సీసీ, పోలీస్ అధికారులు రాజేష్ మృతదేహంపై జాతీయ జెండాను కప్పి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం వీర మరణానికి గౌరవ సూచికంగా మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి నివాళులర్పించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, తహసీల్దార్ సత్యనారాయణ, మాజీ సైనిక సంఘం సభ్యులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తండ్రి చిట్టివాడు తలకొరివి పెట్టి చితికి నిప్పంటించారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, ఇతర అధికారులు, వేలాది మంది జనం పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి



అంత్యక్రియలకు హాజరైన మంత్రి, కలెక్టర్, ఎస్పీ



అధికార లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహిస్తూ..



శ్రీకాకుళం మండలంలోని సింగుపురం పాఠశాలలో దుండగుల విధ్వంసం (ఫైల్)

# దాడులు దౌర్జన్యాలు దోపిడీలు



టీడీపీ నేతలు దాడి చేయడంతో విలపిస్తున్న లక్ష్మీపురం ఎంపీటీసీ గండు మోహనరావు (ఫైల్)

## టీడీపీ నెల రోజుల పాలన ప్రోగ్రెస్ రిపోర్టు ఇదే



రాష్ట్రంలో అసలు శాంతి భద్రతలు ఉన్నాయా? అసలు పోలీసు వ్యవస్థ పనిచేస్తోందా? అత్యాచారాలు, దాడులు, హత్యలతో ఆందోళనకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. నేనొస్తే శాంతియుత పరిస్థితులు ఉంటాయి. హత్యలు, అత్యాచారాలకు ఆస్కారమివ్వను. తప్పు చేసినోడికి మళ్లీ తప్పు చేయకూడదనేలా ట్రీట్‌మెంట్ ఇస్తాను.

– ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు మాటలు



దౌర్జన్యాలు, రౌడీయిజం తప్ప మరేవి లేవు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు. మేమొస్తే శాంతిభద్రతల విషయంలో తేడా రానీయబోం. ఎలా ఉంటాయో చేసి చూపిస్తాం. తప్పు చేయాలంటే భయపడే పరిస్థితిని తీసుకొస్తాను.

– ఎన్నికలకు ముందు జరిగిన సభల్లో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

- చెలరేగిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- దళితులు, ఉద్యోగులపై వేధింపులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం
- ఎక్కడికక్కడ శాంతిభద్రతల సమస్యలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఇలా.. రకరకాలుగా అసత్య ప్రచారాలు చేసి, ప్రజల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసి ఎన్నికల్లో లబ్ధి పొందారు. తాము వస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలకు డోకా ఉండదని ప్రజల్ని నమ్మించారు. తీరా అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలను గాలికొదిలేశారు. నెల రోజులుగా రాష్ట్రంలోనే కాదు జిల్లాలోనూ ఎటు చూసినా దాడులు..దౌర్జన్యాలు.. హత్యలు..అత్యాచారాలు..తదితర అఘాయిత్యాలే. ఇంకా చెప్పాలంటే కూటమి శ్రేణులే శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్నాయి. దాడులు, దౌర్జన్యాలతో చెలరేగిపోతున్నారు. వీరిని చూసి మిగతా వాళ్లు హత్యలకు, అత్యాచారాలకు తెగబడుతున్నారు. కూటమి నెల రోజుల పాలన చూస్తే మూడు హత్యలు.. ఆరు అత్యాచారాలు అన్నట్టుగానే సాగింది. జిల్లాలో ఎప్పుడూలేనంతగా శాంతిభద్రతల సమస్యలు నెలకొన్నాయి. ఎన్నికల్లో గెలవడమే తరువాయి అరాచకం మొదలెట్టారు. ఎక్కడికక్కడ దాడులు చేయడం, దౌర్జన్యాలకు దిగడం, ఇసుక, మట్టి దోపిడీకి పాల్పడటం, అధికారులను బెదిరించడం, వేధించడం వంటివి పెచ్చుమీరిపోయాయి.

**టీడీపీ కార్యకర్తల దాడుల్లో కొన్ని..**

- పలాస కిడ్నీ ఆసుపత్రి వద్ద విధ్వంసం సృష్టించి దివంగత నేత వైఎస్సార్ పేరు తొలగించారు.
- చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముందే నిమ్మాడ వైఎస్సార్ సీపీ ఏజెంట్ తండ్రిని అమ్మవారి వేటల సందర్భం చూసి టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడ్డ వ్యక్తి విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందారు.
- పలాస మండలం లక్ష్మీపురం ఎంపీటీసీ గండు మోహనరావుపై జూన్ 7న రాత్రి పొలం వద్ద కాపు కాసి ఇనుపరాడ్లతో టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడారు. అడ్డుపడిన మేనల్లుడు, భార్యలపైనా దాడి చేశారు.
- మందస మండలం సరియాపల్లికి చెందిన రఘుపై కత్తితో దాడి చేశారు.
- శ్రీకాకుళం మండలం భైరివానిపేటకు చెందిన శిమ్మ అప్పన్న, బగ్గు రామారావులపై జూన్ 7న రాత్రి టీడీపీ కార్యకర్తలు కర్రలతో దాడులు చేశారు.
- శ్రీకాకుళం రూరల్ మండలంలో ఒక పాఠశాలలో విధ్వంసం సృష్టించారు.
- జూలై 7న ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న వంటశాల భవనాన్ని టీడీపీ కార్యకర్తలు కూల్చేశారు. సర్పంచ్ మొండేటి ధర్మారావు ఫిర్యాదు చేశారు.



- రణస్థలంలో ఉన్న యూబీ బీర్ల కంపెనీ ప్రతినిధులపై దాడులు చేశారు. కేసులు కూడా నమోదయ్యాయి. తమకు కప్పం కట్టాలని ఏకంగా ఎమ్మెల్యే ప్రోద్బలంతో వీరంగం సృష్టించారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది.
- ఇటీవలే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆయన సోదరునిపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు.

**ఇసుక, మట్టి దోపిడీ**



- టీడీపీ నేతలు యథేచ్ఛగా ఇసుక దందా సాగించారు. శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని పొన్నాం, బట్టేరు, కరజాడ, నైరా, బైరీ, కిల్లిపాలెం, ఖల్లేపల్లి ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా చేశారు.
- గార మండలం అంబళ్లవలస, బూరవిల్లి ప్రాంతంలో తవ్వకాలు సాగించారు.
- ఆమదాలవలస మండలం దూసి, తోటాడ, అక్కివరం, నిమ్మ తొర్లవాడ ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేశారు.
- నరసన్నపేట మండలంలో గోపాలపెంట, మడపం, బుచ్చిపేట, చేనులువలస, లుకలాం, వెంకటాపురం, గెడ్డవానిపేట గ్రామాల్లో రాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తరలించారు. మడపాంలో సాక్షాత్తు మంత్రి అచ్చెన్నాయుడు పేరు చెప్పి అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపట్టి, తరలించారు.
- జలుమూరు మండలం అందవరం, పర్లాం, కొమ్మనాపల్లి తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపారు.
- ఇచ్ఛాపురంలో ఇసుకతో పాటు మట్టి అక్రమ తవ్వకాలు జరిపారు.

**అధికారులపై వేధింపులు..**

- తన మాట వినలేదని అధికారులపై వేధింపులకు కూడా పాల్పడ్డారు. ఎచ్చెర్ల మహిళా ఎంపీడీవో రమాదేవిపై ఇద్దరు టీడీపీ నాయకులు అనుచితంగా వ్యవహరించారు. బట్టలు ఊడదీసి తంతామని బెదిరించారు.
- ఎచ్చెర్ల మండలంలో అక్రమ బోర్లు తొలగించే విషయంలో టీడీపీ నాయకులవి వదిలేసి మిగతా వారిని తొలగించాలని ఇద్దరు అధికారులను వేధించారు. దీంతో వారిలో ఒకరు వీఆర్ఎస్ పెట్టుకోగా, మరొకరు ఉద్యోగాన్ని వదిలేశారు.
- ఆమదాలవలస, టెక్కలి నియోజకవర్గంలో ఉద్యోగులపై వేధింపులు పతాక స్థాయికి చేరాయి.

**టీడీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన హత్యల్లో కొన్ని**

- జూన్ 30న ఇచ్ఛాపురం స్వర్ణపురం బీచ్ (ఏవోబీ ప్రాంతం)లో ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఆసి బాలు అనే యువకుని ఛాతీపై బలమైన ఆయుధంతో ఇచ్ఛాపురం యువకులు గాయపర్చి హత్య చేశారు.
- జూన్ 5 రాత్రి సోంపేట మండలం కొర్లాం జాతీయ రహదారి సమీపంలో సంగీత దాబాలో సిబ్బంది మధ్య జరిగిన గొడవలో మాదుగుల రాంబాబు (54) చనిపోయాడు.
- జూలై 2న పొందూరు మండలం తాడివలస సమీప బొడ్డేపల్లి గ్రామానికి చెందిన అమలాపురం రాజేశ్వరిని నరసన్నపేట మండలం ఉర్లాంకు చెందిన గోపాల్ హత్య చేసి మృతదేహాన్ని ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి లొంగిపోయాడు.

**అత్యాచారాలు (లైంగిక వేధింపులు)**

- జూన్ 14న ఎచ్చెర్ల మండలం తోటపాలెంలో తల్లి వద్ద ఉన్న బాలికను తల్లి ప్రియుడు లైంగిక వేధింపులకు గురిచేశాడు. దీనిపై బాలిక, బాలిక తండ్రి ఎచ్చెర్లలో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదైంది.
- జూన్ 23న ఎచ్చెర్ల మండలం పొన్నాడకు చెందిన 15 ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. (ప్రేమ వ్యవహారం కారణంగా) నిందితునిపై పోక్సో కేసు కూడా నమోదైంది.

| నెల రోజుల పాలనలో | హత్యలు | దాడులు | హత్యాయత్నాలు | మిస్సింగ్స్ | ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం | మహిళలపై దాడులు | వేధింపులు | దళితులపై దాడులు |
|---|---|---|---|---|---|---|---|---|
| | 4 | 6 | 4 | 2 | 4 | 3 | 3 | 2 |

# నేను చెప్పిన వాళ్లొస్తేనే పనులు చేయండి

- కార్పొరేషన్, మండలాల్లో టీడీపీ నాయకులకు పెత్తనం పంపకం
- అధికారులకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాలు
- తన వాళ్ల జాబితాను కూడా ఇచ్చినట్టుగా సమాచారం!
- ఎమ్మెల్యే ఆదేశాలతో టీడీపీలో లుకలుకలు
- కొందర్ని తొక్కి పెట్టేందుకేనని పార్టీలో చర్చ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గం కూటమిలో లుకలుకలు మొదలయ్యాయి. ముఖ్యంగా పెత్తనం పంపకాలపై టీడీపీ నాయకుల్లో అసంతృప్తి ఆవహించింది. తాను నిర్దేశించిన నాయకులకే పనులు చేసి పెట్టాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాలు ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఆగ్రహం తెప్పిస్తున్నాయి. కొందరికే పెత్తనం ఇస్తే మిగతా వారంతా వారి వద్ద చేతులు కట్టుకుని తిరగాలా అని ఆవేదన చెందుతున్నారు. ఒకవైపు జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పువ్వు బిళ్లతో వస్తే పనులు చేసి పెడతారని చెప్పగా, అందుకు భిన్నంగా తాను సూచించిన నాయకుల పనులే చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో ఇటు నాయకులు, అటు అధికారులు అయోమయం చెందుతున్నారు. ఇదే సమయంలో జనసేన, బీజేపీ నాయకులను విస్మరించడంతో వారిలోనూ అసంతృప్తి చోటుచేసుకుంది.

**అధికారులకు తలనొప్పిగా పరిణామాలు..**

టీడీపీ అధికారంలోకి రావడమే తరువాయి ప్రతీ కార్యకర్త తానే గొప్ప అని భావించుకుంటున్నారు. పసుపు కండువా వేసుకుని వెళ్తే చాలు అధికారులు కూర్చోబెట్టి పనిచేసి పెడతారని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే అచ్చెన్నాయుడు అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలివ్వడంతో తాము చెప్పిందే వేదమని, అడిగింది చేసి పెడతారన్న అత్యుత్సాహంతో ఉన్నారు. దానికి తగ్గట్టుగానే ప్రభుత్వ కార్యాలయాల్లో హడావుడి చేస్తున్నారు. ఎక్కడికక్కడ, ఎవరికి వారు అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పుడది అధికారులకు చిరాకు పుట్టిస్తోంది. ప్రతిఒక్కడూ నాయకుడని చెప్పుకుని హడావుడి చేస్తుండటంతో విసిగిపోతున్నారు. వచ్చినోడు కార్యకర్తో, నాయకుడో తెలియక, వారి ఓవర్ యాక్షన్ చూడలేక ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడూ లేని సంస్కృతిని చూస్తుండటంతో బయటికి చెప్పుకోలేక, లోపల మింగలేక తలలు పట్టుకుంటున్నారు.

**టీడీపీలో కలకలం..**

గుండ లక్ష్మీదేవి వర్గంగా ఉన్న నాయకులను గొండు శంకర్ తప్పనిసరిగా తొక్కి పెడతారన్న వాదన నియోజకవర్గ టీడీపీలో ఉంది. మొదటి నుంచి తన వెంట ఉన్న నాయకులకే ప్రాధాన్యం ఇస్తారన్న వాదన ఉంది. ఎన్నికలకు ముందు ఇదే విషయాన్ని గొండు శంకర్ కూడా ఓ మీడియాతో అన్నట్టుగా ప్రచారం జరిగింది. ఎన్నికల్లో గుండ లక్ష్మీదేవి వర్గం తన వెంట నడిచినా, తన విజయానికి కృషి చేస్తున్నట్టుగా ఓవర్ యాక్షన్ చేసినా.. వారిని తన వెంట మొదటి నుంచి నడిచిన వారితో సమానంగా చూడరనే అభిప్రాయం ఉంది. ఇలాంటి వాదనలు, అభిప్రాయాలు ఉన్న కారణంగానే లక్ష్మీదేవి వర్గీయులు చాలా మంది ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో ఎక్కువగా కలిసి ఉండే ప్రయత్నం చేస్తున్నారు. అటు అచ్చెన్నాయుడును, ఇటు రామ్మోహన్‌నాయుడిని నమ్ముకుని నడిస్తే ఎమ్మెల్యే గొండు శంకర్ ఏం చేయలేరన్న ధీమాతో కొందరు ఉన్నారు. ఇలాంటి సమయంలో పిడుగు లాంటి ఆదేశాలు మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే శంకర్ ఇవ్వడంతో టీడీపీలో చిచ్చు రేగినట్టు అయింది. డివిజన్ల వారీగా తనకు నచ్చిన వారిని ఇన్‌చార్జిగా, రెండు డివిజన్లకు ఒక సుపీరియర్ అని ఒకర్ని నియమించి, ఆ జాబితా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఇవ్వడమే కాకుండా స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. గతంలో నియమితులైన పట్టణ అధ్యక్షుడు చెప్పాడనో.. ఇంకెవరో చెప్పారనో చేయడానికి వీల్లేదని.. తాను చెప్పినట్టుగా నడుచుకోవాలని హుకుం జారీ చేసినట్టు సమాచారం. ఈ తరహా ఆదేశాలు ఒక్క కార్పొరేషన్‌లోనే కాదు ఎంపీడీఓ, తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లినట్టు తెలుస్తోంది. దీంతో టీడీపీలో కలకలం రేగింది. తనకిష్టమైన డివిజన్ ఇన్‌చార్జి, వారిపైన నియమించే సుపీరియర్‌కే పెత్తనం ఇస్తే అదే స్థాయి మిగతా నాయకులంతా ఏం చేయాలని.. వారంతా పెత్తనం అప్పగించిన వారి వెంట తిరగాలా? వారికి చెప్పుకుని పనులు చేయించుకోవాలా? అని మదనపడుతున్నారు.

**మా పరిస్థితేంటి: జనసేన, బీజేపీ నాయకులు**


ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులకిచ్చిన ఆదేశాలతో టీడీపీలోనే అసంతృప్తి ఉందనుకుంటే జనసేన, బీజేపీ నాయకుల్లో అంతకుమించి ఉంది. గొండు శంకర్‌కు ఇష్టమైన టీడీపీకి చెందిన డివిజన్ ఇన్‌చార్జిలకు, వారిపై నియమించిన సుపరీయర్‌కు పెత్తనం అప్పగిస్తే తమ పరిస్థితేంటని ఆందోళన చెందుతున్నారు. కూటమిగా ఏర్పడి, కీలకంగా పనిచేయడం వలనే గెలుపు సాధ్యమైందని.. అలాంటప్పుడు తమను విస్మరిస్తున్నారని ఆవేదనతో ఉన్నారు. తమకంటూ ఒక గుర్తింపు ఉండాలని, ప్రతీ దానికి టీడీపీ నాయకులపైనే ఆధారపడేలా ఉండకూడదని.. తాము కూడా స్వతంత్రంగా ఉండేలా ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, ఆ మేరకు అధికారులకు ఆదేశాలివ్వాలని కోరుతున్నారు. ఇలా చేయకపోతే తమను కూడా తొక్కేసిన ట్లేనని భావిస్తున్నారు.

### ఆధిపత్య పోరు..



ఇలాంటి సమయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాలు అధికారులకు కొంత స్పష్టత ఇచ్చినా టీడీపీ నాయకుల్లో మాత్రం అసంతృప్తికి గురిచేశాయి. ఇప్పటికే పార్టీ తరఫున డివిజన్ ఇన్‌చార్జి ఉన్నాడని.. ఇలా రెండు డివిజన్‌లకు ఒక సుపీరియర్ ఉంటాడని.. ఆ ఇద్దరు చెప్పినట్టుగా నడుచుకోవాలని.. వారు చెప్పిన పనులే చేయాలని నేరుగా ఒక సమావేశంలో అధికారులను ఆదేశించారు. డివిజన్ల వారీగా వారి పేర్లు ఇస్తానని.. వారికే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని క్లారిటీ ఇవ్వడంతో డివిజన్ ఇన్‌చార్జి స్థాయి కన్నా పట్టు ఉన్న టీడీపీ నాయకుల్లో అలక మొదలైంది. వాస్తవంగా శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీలో రెండు గ్రూపులున్న మాట అందరికీ తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వర్గ మొకటి, ప్రస్తుత ఎమ్మెల్యే గొండు శంకర్ వర్గ మొకటి. ఈ రెండు వర్గాలు ఎన్నికలకు ముందు విభేదించుకున్నా ఎన్నికలొచ్చేసరికి కలిసిపోయాయి. దీంతో గొండు శంకర్‌కు అనూహ్య విజయం వరించింది. అధికారం రావడమే తరువాయి టీడీపీలో ఆధిపత్య పోరు మొదలైంది.

## కామెంట్ బాక్స్




### రెడ్‌బుక్ రాజ్యాంగం

నరసన్నపేట : టీడీపీ నేతలు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, కూటమి అధికారం చేపట్టాక జరుగుతున్న హింసా రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ రషీద్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని గురువారం పేర్కొన్నారు. రషీద్ హత్యను వ్యక్తిగత కక్షగా చిత్రీకరించడం శోచనీయమని చెప్పారు. పుంగనూరులో టీడీపీ దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్లిన ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు.




### కిరాతకం రాజ్యమేలుతోంది

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ప్రశాంతమైన ఆంధ్రప్రదేశ్‌లో కిరాతకం రాజ్యమేలుతోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్ అన్నారు. గురువారం ఇచ్ఛాపురం ఎంపీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై హత్య చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. సమావేశంలో ఎంపీపీ బోర పుష్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.



### గాడితప్పిన శాంతిభద్రతలు

టెక్కలి: సంక్షేమ పాలన అందజేయాల్సిన కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పేరుతో రాక్షస పాలన కొనసాగిస్తోందని, శాంతి భద్రతలు పూర్తిగా గాడి తప్పి ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ దుయ్యబట్టారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకల దాడి, వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను హత్య చేయడం దారుణమని పేర్కొన్నారు. అత్యాచారాలు, మహిళలపై వేధింపులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



### రాక్షస పాలన

టెక్కలి: బూటకపు హామీలను నమ్మి మీకు అధికారం ఇస్తే.. రెడ్‌బుక్ పేరిట కక్షలు తీర్చుకుంటారా? అంటూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూటమి ప్రభుత్వ పాలనపై మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నడూ లేని రీతిలో నడిరోడ్డుపై హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసాలు, బాలికలపై అఘాయిత్యాలతో రాష్ట్రం రావణకాష్టంగా మారిందని దుయ్యబట్టారు. వినుకొండలో అందరూ చూస్తుండగానే వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీకి చెందిన జిలానీ హత్య చేయడం వంటి ఘటనలు చూస్తుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు కనుమరుగవుతున్నాయన్నారు.

## క్లుప్తంగా

### చేయూత జాబితాలు సిద్ధం చేస్తున్నాం

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడతకు సంబంధించి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరికీ అందజేశామని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలలో కొంత మందికి నగదు జమ కాలేదని, సచివాలయాల నుంచి జాబితాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. జాబితాల సేకరణకు సంబంధించి మౌఖిక ఆదేశాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు.

### నేటి నుంచి బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

**ఎచ్చెర్ల క్యాంపస్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 14 బీఎడ్ కళాశాలల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. పలాస, టెక్కలి, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రాజాం జీసీఎస్ఆర్, పాలకొండ తమ్మినాయుడు కళాశాల వేదికగా ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 1220 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు.

### 'లాకౌట్ ఆలోచన లేదు'

**టెక్కలి:** రావివలస ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమ ఉత్పత్తిపై మార్కెట్‌లో నష్టాలు ప్రభావం చూపడంతో ఈ నెల 31న చివరి పనిదినంగా నోటీసులు జారీ చేశామని, ఎటువంటి లాకౌట్ ఆలోచన లేదని కంపెనీ ప్రతినిధులు తెలియజేసినట్లు జిల్లా పరిశ్రమల శాఖాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ పరిస్థితుల్లో లాభాల పరిస్థితులు చోటు చేసుకుంటే మళ్లీ పరిశ్రమ తెరిచి కార్మికుల సేవలను కొనసాగిస్తామని ప్రతినిధులు వెల్లడించినట్లు పేర్కొన్నారు.

### బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలి


బుడుమూరు రాజేష్

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టబోతున్న బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.లక్ష కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలు పన్నులు కడుతున్నా కేటాయింపులు మాత్రం జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల కులగణన చేపట్టి, దాని ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరగాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటీకరణ చేయకూడదని, రిజర్వేషన్లు ఎత్తివేయకూడదని కోరారు. బీసీలకు బడ్జెట్‌లో అన్యాయం జరిగితే జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

### నేడు కేంద్ర మంత్రి రాక

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శుక్రవారం జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఇచ్ఛాపురం చేరుకొని స్వేచ్ఛావతి అమ్మవారిని దర్శించుకుని, మున్సిపల్ కార్యాలయంలో 10.30 గంటలకు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కవిటి మండలం రామయ్యపుట్టుగ చేరుకుని స్థానికులను కలిశాక సాయంత్రం 4 గంటలకు టెక్కలి జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుని ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు. రాత్రి 9 గంటలకు శ్రీకాకుళం నగరంలోని తన నివాసానికి చేరుకుంటారని తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో ఆవు మృతి


మృతి చెందిన ఆవు

**వజ్రపుకొత్తూరు:** మండలంలోని కొత్తపేటలో విద్యుత్ షాక్‌కు గురై గంటా పోలయ్యకు చెందిన పాడి ఆవును మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా కంచె లేకపోవడంతో షాక్ గురై మృతి చెందిందని, దాదాపు రూ.50వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

### కుక్కదాడిలో బాలుడికి గాయాలు

**ఆమదాలవలస:** మండలంలోని చిన్నజొన్నవలస నిర్వాసిత కాలనీకి చెందిన చల్ల రతీష్‌పై గురువారం కుక్క దాడి చేసింది. కాలు, చేతులపై తీవ్ర గాయాలు కావడంతో బాలుడిని తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించారు.

### సీవీఆర్ అకాడమీకి వివేక్ ఎంపిక


వివేక్ అమృత్ నారాయణ్ మంగి

**పాతపట్నం:** మండలంలోని చంగుడి గ్రామానికి చెందిన వివేక్ అమృత్ నారాయణ్ మంగి ప్రఖ్యాత సి.వి.రామన్ సైన్స్ రీసెర్చ్ అకాడమీకి ఎంపికయ్యాడు. వివేక్ తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎం.ఎస్.ఇండస్ట్రీ మైక్రో బయాలజీ పూర్తి చేశాడు. డెంగీ వైరస్ అనే అంశంపై పరిశోధన పత్రం పంపించినట్లు తండ్రి ఎం.రామారావు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు.

# ఆలోచన అదిరింది.. ప్రయోగం ఫలించింది


పాత దిబ్బలపాలెంలో ప్రయోగించిన రాకెట్ రీ-ల్యాండింగ్ ప్రయోగం

**విషయం**

సాధారణంగా రాకెట్ నింగిలోకి ఎగిరిన తర్వాత ప్రయోగం పూర్తయ్యాక తిరిగి సముద్రంలో కూలిపోతుంది. కోట్లాది రూపాయల వ్యయంతో తయారయ్యే ఈ రాకెట్ భాగం ఇలా సముద్రంలో పడిపోవడం వల్ల నిరుపయోగంగా మారుతోంది. అదే ప్రజలకు హాని కలగకుండా సురక్షితంగా భూభాగంపైనే పడితే మళ్లీ ప్రయోగానికి ఉపయోగించుకోవచ్చు. ఇదే లక్ష్యంతో ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థులు తక్కువ ఖర్చుతో ప్రయోగం చేసి విజయం సాధించారు.

**చేసిందెవరంటే..**

టీమ్ లీడర్‌గా మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి బైరెడ్డి జయంత్. తోటి విద్యార్థులు అబూసోలామ్, గౌరీశంకర్, లక్ష్మణ్, వినయ్, విజయ్ సహకరించారు. మెకానికల్ హెడ్ డాక్టర్ ఎస్.మధులత సైతం పలు సూచనలు చేశారు.

- రాకెట్ రీ ల్యాండింగ్‌పై పరిశోధనలు
- అంబేడ్కర్ వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థుల ఘనత
- తక్కువ ఖర్చు.. పునర్వినియోగమే లక్ష్యంగా ప్రయోగం
- వెల్లువెత్తుతున్న అభినందనలు

**ఎచ్చెర్ల క్యాంపస్ :**

పరిశోధనల్లో రాకెట్ ల్యాండింగ్ టెక్నాలజీ అనేది కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ ప్రక్రియలో కోట్లాది రూపాయల ఖర్చుతో రూపొందించిన రాకెట్ ప్రయోగం పూర్తయ్యాక సముద్రంలో పడిపోతుంది. ఎంతో వ్యయంతో రూపొందించిన రాకెట్ ఇలా నిరుపయోగంగా సముద్రజలాల్లో పడకుండా.. జనాలు లేని ప్రాంతాల్లో సురక్షితంగా పడి మళ్లీ వినియోగంలోకి తీసుకురావటం అనే అంశంపై ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఏపీజే అబ్దుల్ కాలాం ఇంజినీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజినీరింగ్ మూడో ఏడాది చదువు ఉన్న విద్యార్థులు దృష్టిపెట్టారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన రీసెర్చ్ హబ్‌లో పరిశోధన కొనసాగించారు. ప్రయోగానికి స్పేస్ ప్రొపెలెంట్ స్పెషమెన్ టెస్ట్‌గా(ఎస్‌పీఎస్‌టీ)గా నామకరణం చేశారు. విద్యార్థుల ప్రయోగాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ 'ఎక్స్' ద్వారా అభినందించారు. తక్కువ ఖర్చుతో రీ-ల్యాండింగ్ సాంకేతికతతో రూపొందించిన రాకెట్ ప్రయోగం విద్యార్థుల ప్రతిభగా కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థుల ప్రయోగానికి తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు.

**బీచ్‌లో ప్రయోగం..**

ఇంజినీరింగ్ విద్యార్థి బైరెడ్డి జయంత్‌కు మెకానికల్ ఇంజినీరింగ్ మొదటి ఏడాదిలోనే రాకెట్ ల్యాండింగ్ ఆలోచన వచ్చింది. తోటి విద్యార్థులు అబూసోలామ్, గౌరీశంకర్, లక్ష్మణ్, వినయ్, విజయ్‌లతో తన ఆలోచనను పంచుకున్నారు. మెకానికల్ హెడ్ డాక్టర్ ఎస్.మధులత సైతం పలు సూచనలు చేశారు. రెండేళ్ల ప్రయోగ పరిజ్ఞానంతో తాము తయారుచేసిన రీ ల్యాండింగ్ టెక్నాలజీ రాకెట్‌ను బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం బీచ్‌లో ఇటీవల ప్రయోగించారు. వీరు అనుకున్నట్లే ప్రయోగం విజయవంతమైనట్లు బృందం సభ్యులు చెప్పారు. ఇందుకు తమ వద్ద ఉన్న రూ. 50 వేలు ఖర్చుచేసినట్లు వివరించారు.


విద్యార్థులతో అప్పటి వీసీ వెంకటరావు(ఫైల్)


ప్రయోగ దశలో రీ-ల్యాండింగ్ రాకెట్ స్పేస్ ప్రొపెలాంట్ స్పెషమెన్ టెస్ట్ పరిశోధన

**అనవసర ఖర్చు నుంచి విముక్తి**

స్పేస్ రీసెర్చ్ అంటే ఎనిమిదో తరగతి నుంచే ఆసక్తి. ఇంజినీరింగ్‌లో చేరాక తోటి విద్యార్థులలో నా ఆలోచన పంచుకున్నాను. వారు కూడా విలువైన సూచనలు చేశారు. అందరం కలిసి హెచ్‌ఓడీ సహకారంతో రూ.50 వేలు ఖర్చు చేసి ఎస్‌పీఎస్‌టీ రీ-ల్యాండింగ్ సాంకేతికతతో రాకెట్ రూపొందించాం. పాత దిబ్బలపాలెంలో ప్రయోగం చేశాం. ఒకసారి వినియోగించిన రాకెట్ మళ్లీ వినియోగంలోకి తీసుకొస్తే ఖర్చు తగ్గుతుంది. మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు చాలా డబ్బు ఆదా అవుతుంది.

– బైరెడ్డి జయంత్, టీమ్ లీడర్

**పరిశోధనలకు ప్రోత్సాహం..**

టీమ్‌లీడర్ జయంత్ ఆలోచన నన్ను సైతం ఆలోచింపజేసింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం అనేక ప్రయోగాలు రీ-ల్యాండింగ్ సాంకేతికతపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్రయోగంపై వర్సిటీలో ఏర్పాటు చేసిన రీసెర్చ్ హబ్‌లో పరిశోధనలు జరుగుతున్నాయి. వర్సిటీ అధికారులు సైతం ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం సైతం ప్రోత్సాహానికి ముందుకొచ్చింది. విద్యార్థుల ఆలోచనలు భవిష్యత్తులో కార్యరూపం దాల్చుతాయన్న నమ్మకం ఉంది.

– డాక్టర్ ఎస్.మధులత, మెకానికల్ హెచ్‌ఓడీ

## ఏడాదిలోగా స్టేడియం పనులు పూర్తి


కేఆర్ స్టేడియం బ్లూప్రింట్‌ను మంత్రికి వివరిస్తున్న అధికారులు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** జిల్లా కేంద్రంలో కోడిరామ్మూర్తి స్టేడియం పనులను ఏడాదిలోగా పూర్తిచేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. స్టేడియం పునః నిర్మాణ పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ, క్రీడా శాఖ, కాంట్రాక్టర్లతో స్టేడియం పనులు, క్రీడాభివృద్ధిపై మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్టేడియం పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌కు రెండేళ్ల గడువు ఉన్నా ఏడాదిలోపే పూర్తి చేసి ఇస్తామని హామీ లభించిందన్నారు. శ్రీకాకుళం–ఆమదాలవలస రహదారికి అత్యవసరంగా రూ.కోటి నిధులు ఇచ్చామని, కొత్త రోడ్డు జంక్షన్ నుంచి వాకలవలస వరకూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామని తెలిపారు. గత ఐదేళ్లు వంశధార నుంచి పలాస, వజ్రపుకొత్తూరులకు నీరు ఇవ్వలేకపోయారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.90 లక్షల నిధులతో 1.70 లక్షల ఎకరాలకు నీరిచ్చామని చెప్పారు. తొమ్మిది శాఖలు నిర్వహిస్తున్న మంత్రిగా జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని మంత్రి పేర్కొన్నారు. మూలపేట పోర్టును త్వరితగతిన పూర్తి చేసి, అక్కడే మినీ ఎయిర్‌పోర్టును నిర్మిస్తామని మంత్రి తెలిపారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించి వలసలు నివారిస్తామని చెప్పారు. జిల్లా తలసరి ఆదాయాన్ని పెంచి రాష్ట్రంలో నెంబర్‌వన్ జిల్లాగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, మాదారపు వెంకటేష్, పైడిశెట్టి జయంతి, నగర టీడీపీ నాయకులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు పాల్గొన్నారు.

## పరిమళించిన మానవత్వం


చాందినీకి నగదు అందిస్తున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు

**కవిటి:** అమ్మానాన్నలు కుటుంబ గొడవల కారణంగా విడిపోయారు. అల్లారు ముద్దుగా పెరగాల్సిన చిన్నారి అమ్మమ్మ వద్దకు చేరింది. ఇలాంటి పరిస్థితిలో కడుపులో కణితి పెరగడంతో అనారోగ్యం పాలైంది. కవిటి మండలం పెద్దబల్లిపుట్టుగకు చెందిన చిన్నారి చాందినీ దీనస్థితిని తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఔదార్యం కనబరిచారు. బాలిక వైద్యానికి రూ.1,50,000 ఖర్చు అవుతుందని తెలుసుకుని ప్రస్తుతానికి రూ.50,000 ఆర్థికసాయాన్ని అందించారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి చిన్నారికి వైద్యానికి అండగా నిలవాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి


శ్రీకాంత్ సాహు(ఫైల్)

**సోంపేట :** మండలంలోని బారువ కంబ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బారువ గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ శ్రీకాంత్ సాహు(27) మృతి చెందాడు. బారువ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బారువ గ్రామానికి చెందిన తెలుకుల పార్వతీశం, జున్నుల చిన్నకుమారుడు శ్రీకాంత్ సాహు కూలీ పనులు చేస్తూ కష్టపడి చదివి ఆర్మీలో ఉద్యోగం సంపాదించాడు. ఆరేళ్లుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. గురువారం సాయంత్రం స్నేహితుడు వినయ్‌తో కలిసి సోంపేట పట్టణానికి వెళ్లాడు. 9 గంటల ప్రాంతంలో బారువ గ్రామానికి తిరిగి వస్తుండగా కంభ ప్రాంతంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బారువ ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. శ్రీకాంత్‌కు సోదరుడు, సోదరి ఉన్నారు. శ్రీకాంత్ సాహు మృతి పట్ల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## అణువిద్యుత్ పరిశ్రమ పనులు మళ్లీ అడ్డగింత


నిరసన తెలుపుతున్న కొవ్వాడ నిర్వాసితులు

**రణస్థలం:** పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే ప్రహరీ పనులు చేపట్టాలని కొవ్వాడ అణు విద్యుత్ కేంద్ర నిర్వాసితులు తేల్చి చెప్పారు. గురువారం ప్రహరీ పనులను మరోసారి అడ్డుకున్నారు. పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలంటూ ఈనెల 12న పనులు అడ్డుకుని నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని అణు విద్యుత్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పనులు ప్రారంభించాలని, అడ్డుకుంటే తదుపరి చర్యలపై చర్చిద్దామని కలెక్టర్ సూచించారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు ప్రహరీ పనులు చేపడతుండగా నిర్వాసితులు వచ్చి పనులు అడ్డుకున్నారు. పెండింగ్‌లో ఉన్న భూ పరిహారం, ధర్మవరం వద్ద పునరావాస కాలనీ నిర్మాణం, ఫిషింగ్ హార్బర్, యూత్ ప్యాకేజీ తదితర సమస్యలు పరిష్కరించాకే పనులు చేపట్టాలని తేల్చిచెప్పారు. నిరసన కార్యక్రమంలో నిర్వాసితులు అల్లిపల్లి రాముడు, అప్పన్న, మైలపల్లి పట్టయ్య, నర్సింహమూర్తి, రాంబాబు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణమూర్తి మాస్టారుకు నివాళులు


కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఆర్‌టీయూ ప్రతినిధులు

**ఇచ్ఛాపురం రూరల్:** పీఆర్‌టీయూలో జిల్లా, రాష్ట్ర స్థాయి శాఖల్లో అత్యున్నతమైన పదవుల్లో పనిచేసిన కృష్ణమూర్తి మాస్టార్ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేశారని ఆ సంఘ నేతలు గుర్తు చేసుకున్నారు. ఎం.తోటూరు సత్యసాయి పాఠశాలలో నిర్వహించిన కృష్ణమూర్తి సంతాప సభలో పలువురు మాట్లాడారు. ఎంతో మంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన మాస్టార్ సేవలతు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమం ఎంఈవో కురమాన అప్పారావు, పీఆర్‌టీయూ జిల్లా సంఘ నేతలు నగిరి శరత్‌బాబు, రమేష్ పాణిగ్రాహి, ఎం.సోమేశ్, డిక్కల కేశవరావు, లాభాల వెంకటరావు, మాసుపత్రి చంద్రశేఖర్‌రెడ్డి, జాడు ప్రకాశరావు, ఎస్.విశ్వనాథం, జన్నెల శంకరరావు, ఎస్.మల్లేశు, కీలు సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్‌లో సౌకర్యాలకు చర్యలు

**శ్రీకాకుళం:** శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో రోగులకు మరిన్ని సౌకర్యాలు, సేవలు అందేలా ఆరోగ్యకరమైన పరిస్థితులను నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం కలెక్టర్ స్వప్నిక్ దినకర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి రిమ్స్ ఆస్పత్రిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆస్పత్రిలో ఐదు లిఫ్టులు పని చేయకపోవటాన్ని ప్రశ్నించారు. రూ.15 లక్షలు వెచ్చించినా ఎందుకు బాగు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూపరింటెండెంట్ షకీలాను ఆదేశించారు. చిన్న చిన్న మరమ్మతులకు అనుమతులు అవసరం లేదని, పనులు పూర్తి చేసి అనుమతులు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో 71 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పగా.. క్యాడర్ల వారీగా తెలియజేయాలని మంత్రి సూచించారు. ఆస్పత్రిలో ఉన్న 559 మరుగుదొడ్లకు నంబర్లు వేసి వాటన్నింటినీ వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కొందరు కాంట్రాక్టర్లు సక్రమంగా జీతాలు చెల్లించటంలేదని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకురాగా కాంట్రాక్టర్‌ను తనను కలవాలని ఆదేశించారు. పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆస్పత్రులకు అక్కడి నుంచి కేజీహెచ్‌కు రిఫర్ చేసే కేసులు తగ్గించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## మహాత్ముడే మా దేవర


కేదారిపురంలో గాంధీజీకి పూజలు చేస్తున్న మహిళలు


నృత్యం చేస్తున్న యువకులు

మహాత్మా గాంధీని దేవుడిగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించి పానకం, ప్రసాదాలు పంచిపెట్టిన అరుదైన ఘటన పలాస మండలం కేదారిపురంలో గురువారం చోటుచేసుకుంది. 1947 స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి గ్రామంలో గాంధమ్మ సంబరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రామాలయం ముందు మహాత్ముని విగ్రహానికి పూలమాలవేసి అక్కడే ఆయన చిత్రపటం ఉంచి పండ్లు, ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గ్రామదేవత గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేసి పూజించారు. సుమారు 370 నివాసాలతో 1200 మందికి పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు ముర్రాటలతో వెళ్లి మేళతాళాలతో అన్ని వీధులు ఊరేగింపుగా వెళ్లి ఎర్రమ్మ, గాంధమ్మ, భూలోకమ్మతల్లి అమ్మవార్లకుల్లి ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. అనంతరం గాంధీ చిత్రపటం వద్ద పూజలు చేశారు.

– కాశీబుగ్గ

## ఆర్టీసీ డ్రైవింగ్ బ్యాచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం అర్బన్:** ఏపీఎస్ ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఎ.విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ బ్యాచ్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆగస్టులో శిక్షణ ప్రారంభమవుతుందని, ఫీజు, ఇతర వివరాలకు 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## మరోసారి ఇసుక నిల్వల లెక్కింపు


అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద డిజిటల్ సర్వే చేస్తున్న మైన్స్ సిబ్బంది

**కొత్తూరు:** మండలంలోని అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక నిల్వలను మైన్స్ అధికారులు డిజిటల్ సర్వే ఆధారంగా గురువారం లెక్కించారు. ఇక్కడ ఈ నెల 8 నుంచి ఇసుక అమ్మకాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అప్పట్లో 35020 క్యూబిక్ మీటర్ల ఇసుక స్వాధీనం చేసుకున్న మైన్స్ అధికారులు రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అప్పుడు మాన్యువల్‌గా ఇసుక లెక్కింపు జరిగినందున ప్రస్తుతం ఇసుక నిల్వ ఎంత ఉందనేది కచ్చితంగా తెలుసుకునేందుకు డిజిటల్ సర్వే చేపట్టినట్లు మైన్స్ సర్వేయర్ ప్రసాదరావు చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 2 వేల టన్నుల ఇసుక విక్రయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రమణయ్య పాల్గొన్నారు. కాగా, ఇసుకపై కొందరు టీడీపీ నేతలు కన్నువేసినందున అధికారులు ముందస్తుగా సర్వే చేపట్టినట్లు తెలిసింది.

**డ్రైవర్లకు తప్పని కష్టాలు..**

ఇసుక ర్యాంపు వద్ద ట్రాక్టర్ డ్రైవర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం ఆరు గంటలకు ర్యాంపు వద్దకు వచ్చినా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. లోడులు వేసిన అద్దెలు గిట్టుబాటు కావడం లేదన్నారు. మరోవైపు వర్షాలు కురుస్తున్నందున భోజనాలు చేసేందుకు కూడా అవస్థలు తప్పడం లేదని, ట్రాక్టర్ కింద బురద మధ్యే తినాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి మరో జేసీబీని లోడింగ్‌కు ఉపయోగించాలని పలువురు డ్రైవర్లు కోరుతున్నారు.


ట్రాక్టర్ వద్ద బురద రోడ్డుపైనే భోజనాలు చేస్తున్న డ్రైవర్లు

## విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి


మెరిట్ విద్యార్థులతో డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, అధికారులు

**ఎచ్చెర్ల క్యాంపస్:** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) పూర్తిచేసుకున్న విద్యార్థులకు గురువారం ఇంజినీరింగ్ సీట్లు కేటాయించారు. 978 మంది విద్యార్థులకు పీయూసీ మార్కులు, ఎంచుకున్న ఆప్షన్, విద్యార్థులు రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా బ్రాంచ్‌లు కేటాయించారు. జిల్లా క్యాంపస్‌లో సీఎస్‌ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ బ్రాంచ్‌లు ఉన్నాయి. ఆర్‌జీయూకేటీలో సమీకృత ఇంజినీరింగ్ కోర్సు ఆరేళ్లు కాగా, రెండేళ్ల పీయూసీ, నాలుగేళ్ల ఇంజినీరింగ్ క్లాస్ వర్కు నిర్వహిస్తారు. పీయూసీలో మొదటి ఐదు స్థానాల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఇంజినీరింగ్ ప్రవేశాలు అందజేసిన డైరెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కమ్యూనికేషన్ స్కిల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, లాంగ్వేజ్ స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. విషయ పరిజ్ఞానం, పారిశ్రామిక అవసరాలను అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, అధికారులు పాల్గొన్నారు.